నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, బుధవారం 24 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM


చర్ల: కుర్నపల్లి వాగును దాటుతున్న ఆదివాసీ మహిళ

# శాంతించిన గోదావరి

**భద్రాచలంలో 50 అడుగుల వద్ద ప్రవాహం**
**కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక**
**వర్షాలు పడితే మళ్లీ వరద పెరిగే ప్రమాదం**
**ముంపు ప్రాంతాల్లో వైద్య బృందాల శిబిరాలు**


భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 23 (నమస్తే తెలంగాణ): రెండు రోజులుగా ఉప్పొంగి ప్రవహించిన గోదావరి మంగళవారం ఒక్కసారిగా శాంతించింది. ఎగువన భారీ వర్షాలు కురవడం, ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల కావడం వంటి కారణాలతో భద్రాద్రి జిల్లా భద్రాచలం వద్ద గోదావరికి వరద పోటెత్తిన విషయం విదితమే. క్రమేపీ పెరుగుతూ రెండో ప్రమాద హెచ్చరికను కూడా దాటి ప్రవహించింది. అయితే, మంగళవారం ఉదయం 10 గంటల వరకు 51.60 అడుగులకు చేరుకున్న గోదావరి ప్రవాహం.. ఆ తరువాత రెండు గంటల పాటు నిలకడగా కొనసాగింది. 11 గంటల నుంచి గంటకు ఒక్కో అంగుళం చొప్పున తగ్గడం ప్రారంభించింది. రాత్రి 7 గంటలకు 50.10 అడుగులకు తగ్గింది. దీంతో భద్రాచలం పట్టణ వాసులతోపాటు చర్ల, దుమ్ముగూడెం మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ వరద ప్రవాహం ఇంకా రెండో ప్రమాద హెచ్చరిక దాటి ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

### ఉదయం భద్రాచలంలోకి వరద నీరు..

మంగళవారం ఉదయం వరకూ పెరుగుతూ వచ్చిన గోదావరి వరద ఉదయం వేళ భద్రాచలం పట్టణంలోకి ప్రవేశించింది. కరకట్ట పనులు చేసే ప్రాంతంలో స్లూయిజ్ నుంచి వరద నీరు పోటు వేసింది. దీంతో నీళ్లు పట్టణంలోకి రావడం ప్రారంభించాయి. వెంటనే అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని మట్టితో నింపడంతో ప్రమాదం తప్పింది. అలాగే, వరద కారణంగా భద్రాచలం నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రహదారి పైకి నీరు చేరిన ప్రాంతాల్లో రాకపోకలను నియంత్రించడం కోసం అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

### ముంపు ప్రాంతాలకు వైద్య బృందాలు..

వరదలు చుట్టుముడుతున్న నేపథ్యంలో వరద ముంపులో ఉన్న గ్రామాలకు వైద్య బృందాలు చేరుకున్నాయి. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపహాడ్ మండలాల్లోని కొన్ని గ్రామాలను ఇప్పటికే వరదనీరు చుట్టుముట్టడంతో అక్కడ పారిశుధ్య లోపించే ప్రమాదం ఉన్నందున వైద్యబృందాలు అక్కడికి వెళ్లి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణులను ముందస్తుగా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### వర్షాలు పడితే మళ్లీ పెరిగే ప్రమాదం..

మరోసారి వర్షాలు అధికంగా కురిస్తే వరద మరోసారి పెరిగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముంపు గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారాలను ఇవ్వాలని స్థానిక అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## పొంగుతున్న కొండ వాగులు

**చర్ల మండలంలో కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులు**


తాలిపేరు ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు


రామచంద్రాపురంలో వైద్య శిబిరం నిర్వహించేందుకు వెళ్తూ కుర్నపల్లి-ఆర్‌సీపురం మధ్య వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

చర్ల, జూలై 23:ఇటీవల కురిసిన వర్షాలకు చర్ల మండలంలోని కొండవాగులు పొంగుతున్నాయి. మండల కేంద్రానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మారుమూల ఆదివాసీ గ్రామాలకు వైద్యసేవలు అందించేందుకు వెళ్లాల్సిన వైద్య బృందాలు ప్రమాదకరమైన వాగులు దాటి వెళ్తున్నారు. స్థానిక ఆదివాసీలు కూడా అధిక లోతుతో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులను దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. సత్యనారాయణపురం వైద్య సిబ్బంది మంగళవారం రామచంద్రాపురంలో వైద్య శిబిరం నిర్వహించేందుకు వెళ్లాల్సి ఉంది. దీంతో కాలినడకన బయలుదేరారు. కుర్నపల్లి, ఆర్‌సీపురం మధ్య ఉన్న వాగును స్థానికుల సాయంతో దాటి వెళ్లారు. చివరికి రామచంద్రాపురం చేరుకొని అక్కడి ఆదివాసీలకు వైద్యసేవలు అందించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే, తిప్పాపురం – బత్తినపల్లి అటవీ గ్రామాల మధ్య, కొత్తపల్లి – దండుపేట మధ్య ఉన్న రోడ్లు వరదలకు తెగిపోయాయి.

### తాలిపేరు వరద తగ్గుముఖం..

అలాగే, ఇప్పటిదాకా ఉధృతంగా ప్రవహించిన తాలిపేరు వరద తాజాగా తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టు అధికారులు మంగళవారం 25 గేట్లు పూర్తిగా ఎత్తి 20,179 క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 74 మీటర్లు కాగా ప్రస్తుతం 69.98 మీటర్ల మేర నీళ్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# సగానికి సగం కోతలు

- అర్హత ఉన్నా అందని ప్రభుత్వ సాయం
- సాంకేతిక కారణాలు చూపుతున్న యంత్రాంగం
- కొనసాగుతున్న రైతుల రుణమాఫీ తిప్పలు


కూసుమంచి ఎస్‌బీఐలో రైతుల కోలాహలం(ఫైల్)

ఖమ్మం, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో పేర్లు వచ్చిన రైతుల కంటే రానివారు సగం మంది ఉన్నట్లు కనిపిస్తున్నది. దీంతో వారంతా సొసైటీలు, బ్యాంకులు, రైతువేదికల వద్దకు క్యూ కడుతున్నారు. రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతుల జాబితా విడుదలకావడంతో గ్రామాల్లో రైతులు తమ పేర్లు ఉన్నాయో లేవో అని తెలుసుకునేందుకు మండలాలు, జిల్లా కేంద్రానికి వస్తున్నారు. జాబితాలో తమ పేరు లేకపోవడంతో అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. రుణమాఫీ పొందిన రైతులు ఆయా బ్యాంకులు, సొసైటీలకు వెళ్లి తమ పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు అందజేస్తున్నారు. ఇదే సమయంలో రుణమాఫీ రాని రైతులు సైతం తమకు తక్షణమే రుణమాఫీ చేయాలని బ్యాంకు, సొసైటీ అధికారులను కోరుతున్నారు. ఖమ్మం జిల్లాలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు 59,172 మందికి రూ.264.23 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28,019 మందికి రూ.132.07 కోట్లు విడుదలయ్యాయి. ఇదిలా ఉండగా.. ఒక్క డీసీసీబీ పరిధిలోనే రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు 1,69,864 మంది ఉన్నారు. వీరికి రూ.908.27 కోట్లు అవసరం ఉంటుందని ఆ బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో సగానికి సగం అర్హత కలిగిన రైతులకు సైతం రుణమాఫీ జరుగలేదని తెలుస్తున్నది. రూ.2 లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు ఎంతమంది ఉన్నారు.. వారికి ఎన్ని కోట్లు అవసరం ఉంటుంది అనేది నేటివరకు సైతం జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు ప్రకటించకపోవడం గమనార్హం.

### దాటవేత, సాగతీతకే ప్రాధాన్యం

అర్హత కలిగి ఉన్నప్పటికీ తమకు రుణమాఫీ రాకపోవడానికి గల కారణాలు తెలపాలని అనేక మంది రైతులు బ్యాంకు మేనేజర్లు, సొసైటీ బాధ్యుల వద్ద మొరపెట్టుకుంటున్నారు. అయితే సరైన సమాధానం చెప్పలేని సంబంధిత అధికారులు సాగతీత, లేకపోతే దాటవేతకు పరిమితమవుతున్నారు. టోల్‌ఫ్రీ, సెల్ నెంబర్లకు ఫోన్ చేసినప్పటికీ సరైన సమాధానం రావడం లేదని రైతులు వాపోతున్నారు. తప్పకుండా వస్తుంది.. ఓపిక పట్టండి అని చెప్పి సొసైటీ సీఈవోలు, బ్యాంకు మేనేజర్లు రైతులను ఇంటికి పంపిస్తున్నారు. మరి కొందరైతే మండల వ్యవసాయ శాఖ అధికారిని కలువాలని, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడగాలని, బ్యాంకు హెడ్డాఫీస్‌కు వెళ్లమని ఇలా రకరకాల సమాధానాలు చెప్పి రైతులను అయోమయానికి గురిచేస్తున్నారు. రెండు బ్యాంకుల్లో అప్పులు తీసుకోవడం వల్ల మాఫీ రాలేదని కొందరు చెప్పడం గమనార్హం.

### మా అమ్మ పేరు లేదు.. నా పేరు లేదు



మా అమ్మ 2009లో పంట రుణం తీసుకుంది. నేను 2014లో రూ.25 వేలు పంట రుణం తీసుకున్నాను. అప్పటినుంచి ప్రతియేటా రెన్యువల్ చేయించుకుంటూ వస్తున్నాం. అయితే మా అమ్మ, నేను ఒకే రేషన్ కార్డులో ఉన్నాం. గత ఏడాది సెప్టెంబర్ వరకు మొత్తం రుణం రూ.95 వేలు అయ్యింది. ప్రస్తుతం జరిగిన రుణమాఫీలో మా అమ్మ పేరు లేదు.. నా పేరు లేదు. ఎందుకు మా పేర్లు రాలేదని ఏపీజీవీబీ మేనేజర్‌ను అడిగితే.. వస్తది కావచ్చు అంటున్నారు. క్రమంగా పేర్లు వస్తున్నాయి అని చెప్పారు. లక్షలోపు పంట రుణం ఉన్నప్పటికీ, రేషన్ కార్డు వల్ల రాలేదా, మరే కారణమో తెలియడం లేదు.

**– బాషా వెంకటేశ్వర్లు, రైతు, నర్సింహాపురం, ఖమ్మంరూరల్**

### నాకు రుణమాఫీ కాలేదు..



గానుగపాడు సహకార సంఘంలో రుణం తీసుకున్నాను. రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ రైతులను మోసం చేసింది. కండీషన్లు, కొర్రీలు పెట్టి సగంమందికి కూడా మాఫీ చేయడం లేదు. గానుగపాడు సొసైటీలో 2,500 మంది రైతులకు 500 మందికి మాత్రమే లక్షలోపు రుణమాఫీ అయ్యింది. నాకు రుణమాఫీ రాలేదు.

**– గుగులోత్ రమేశ్, రైతు, తిప్పనపల్లి మాజీ సర్పంచ్, చంద్రుగొండ మండలం**

## రుణమాఫీ ఎగవేతపై వెనక్కి తగ్గిన సర్కారు

- వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద ఫిర్యాదుల స్వీకరణ
- జిల్లా కార్యాలయం వద్ద కాల్‌సెంటర్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 23 (నమస్తే తెలంగాణ) : మేమొస్తే రుణమాఫీ చేస్తాం.. అది మా వల్లే సాధ్యం.. అని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ ఇవ్వడంలో చతికిలపడింది. పేరుగొప్ప.. ఊరుదిబ్బలా రైతులకు మొండిచేయి చూపింది. కొంతమందికి రేషన్‌కార్డు ఉంటే కుటుంబంలో ఒకరికే అని, మరికొంతమందికి పీఎం కిసాన్‌లో పేరు లేదని మరికొందరికి ఇలా సవాలక్ష కారణాలు చూపి రుణమాఫీ ఎగవేతకు కారణాలు చూపెట్టారు. దీంతో అర్హులైన రైతులకు రుణమాఫీ రాకుండాపోయింది. జిల్లావ్యాప్తంగా లక్షల మంది రైతులు ఉంటే లక్ష రుణం తీసుకున్న కేవలం 28,018 మందిని మాత్రమే గుర్తించింది. దీంతో వేల మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాకుండా పోయారు.

### సొసైటీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

జిల్లావ్యాప్తంగా 21 సొసైటీల పరిధిలో కేవలం 10,661 మందికి మాత్రమే రుణాలు మాఫీ చేశారు. ఇంకా చాలా మంది రుణమాఫీకి అర్హుల జాబితాలో లేకుండాపోయారు. వారంతా సొసైటీ కార్యాలయాలకు వచ్చి ఆధార్‌తో పేర్లు చెక్ చేసుకుని ఇంటిముఖం పట్టడం వారి వంతైంది. ఏమిటని ప్రశ్నిస్తే మేమైతే అన్ని పేర్లు పంపాము.. పై నుంచి ఈ పేర్లే వచ్చాయని సమాధానం చెప్పడంతో రైతులు నిరాశ చెందారు. ఇక బ్యాంకుల వద్ద రైతులు ప్రతి రోజూ రావడం మా పేరు ఎందుకు రాలేదని తిట్టుకుంటూ పోయిన సంఘటనలు కనిపించాయి.

### ఫిర్యాదుల స్వీకరణ

అర్హులకు రుణమాఫీ ఇవ్వకపోవడంతో జిల్లావ్యాప్తంగా రైతులు చేస్తున్న ఆందోళనకు కాంగ్రెస్ సర్కారు వెనక్కి తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేయడం, బీఆర్ఎస్ నాయకులు రైతులకు అండగా ఉండడంతో ప్రభుత్వం మరోసారి ఆలోచించడానికి నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం అర్హత ఉండి రుణమాఫీ జాబితాలో పేర్లు లేని జాబితాను తయారు చేయాలని వ్యవసాయశాఖకు ఆదేశాలు వచ్చాయి. కలెక్టర్ జితేష్ విపాటిల్ ఆదేశాలతో వ్యవసాయాధికారులు రైతుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఇందుకోసం మం డల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఈవోల వద్ద ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో మొబైల్ నెంబర్‌ను కూడా అందుబాటులో ఉంచారు. జిల్లా పరిష్కార విభాగం ద్వారా సెల్‌నెంబర్ 7288894249 అందుబాటులో ఉంచారు. దీనిపై అధికారికంగా జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

# కనికరించని నిర్మలమ్మ!

- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు దక్కని చోటు
- భద్రాచలం, కొవ్వూరు రైల్వే లైన్ ఊసేలేదు..
- వేతన జీవులు, పేద, మధ్యతరగతి వర్గాలపై భారం
- కేంద్ర బడ్జెట్‌పై వివిధ వర్గాల అభిప్రాయాలు



కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు పెట్టుకున్న ఆశలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నీళ్లు చల్లారు. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి చోటు దక్కక పోగా.. జిల్లాకు ప్రాధాన్యం, కేటాయింపులు లేవని పలు వర్గాలు పెదవి విరుస్తున్నాయి. భద్రాచలం, కొవ్వూరు రైల్వే లైన్‌ను విస్మరించారని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, గిరిజన యూనివర్సిటీకి కేటాయింపులు లేవని, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల కోసం ప్రవేశపెట్టినట్లుగా బడ్జెట్ ఉన్నదని, ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు పలికిన రెండు రాష్ట్రాలకే అధిక మొత్తంలో కేటాయింపులు ఉన్నట్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. వేతన జీవులు, పేద, మధ్యతరగతి వర్గాలపై భారం మోపే విధంగా ఉందని, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులకు మొండిచేయి చూపించారని, ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని పేర్కొన్నారు. *– ఖమ్మం, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### రాష్ట్ర అభివృద్ధిపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు..



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి లేదు. కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ప్రవేశపట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజలకు మొండిచేయి చూపించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో రాష్ట్ర బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు విఫలమయ్యారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. రైతులు, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల ప్రయోజనాలకు, అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా ఉంది. తెలంగాణలో ఏర్పాటు చేయాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదాతో పాటు కేంద్ర విద్య, వైద్య రంగసంస్థల ఏర్పాటు చర్యలు శూన్యం.

**– తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు**

### 8 మంది ఎంపీలున్నా ఫలితం శూన్యం..



తెలంగాణలో బీజేపీకి 8 మంది ఎంపీలున్నా బడ్జెట్‌లో ఫలితం శూన్యంగా కన్పించింది. రాష్ట్ర ప్రాజెక్టులకు జాతీయ హోదా గురించి వారు కనీసం ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం శోచనీయం. అలాగే గడిచిన పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసుకుంటూ వస్తోంది. మంగళవారం నాడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగాల కల్పనపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు. నైపుణ్య అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు ప్రభుత్వ రంగ ఉద్యోగాల కల్పనపై హామీ ఇవ్వకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమే అవుతుంది. తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ గత ఎన్నికల ముందు బీజేపీ చెప్పిన మాటలు నీటిమూటలు అయ్యాయి.

**–మేకల ఉదయ్, యువజన సంఘం నేత, ఖమ్మం రూరల్**

### ప్రజా వ్యతిరేక బడ్జెట్



వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు ఉపయోగం లేని బడ్జెట్. సంపన్నులు, విదేశీ పెట్టుబడిదారుల కోసం ప్రవేశపెట్టినట్లుగా ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. దేశం ఏటా 20 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికి ఎలాంటి నష్ట నివారణ చర్యలు చేపట్టలేదు. దేశంలో రెండు రాష్ట్రాలే ఉన్నట్లు.. మిగిలిన రాష్ట్రాల ప్రయోజనాలను పట్టించుకోలేదు.

**–నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి**

### మధ్యతరగతి ప్రజలను విస్మరించారు..



కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలను విస్మరించారు. ప్రజల వైపు ఆలోచన చేయకుండా వ్యాపారుల కోసం అర్రులు చాచేలా ఉంది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులకు మొండిచేయి చూపించారు. దీనికి తెలంగాణలోని బీజేపీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేని విధంగా ఉంది కేంద్ర బడ్జెట్. దీనిపై బీజేపీ నాయకులను ప్రజలు నిలదీయాలి.

**–పోటు ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి**

### తెలంగాణకు మొండిచేయి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపింది. కేవలం నాలుగైదు రాష్ట్రాలకే బడ్జెట్ కేటాయింపు చేసినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని యువతకు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం బడ్జెట్ కేటాయించకపోవడం దారుణం. మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం ఉక్కు కర్మాగారం ఊసే లేకుండా పోయింది. గిరిజన యూనివర్సిటీకి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం గిరిజనులను పూర్తిగా విస్మరించడమే అవుతుంది. ఇది పూర్తిగా తెలంగాణ వ్యతిరేక బడ్జెట్.

**–మూడ్ జయరాంనాయక్, బీఆర్ఎస్ యువనేత, చుంచుపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

### వేతన జీవులకు నిరాశే..



కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు సంతృప్తి కలిగించలేదు. పాతపన్ను విధానంలో ఎలాంటి మార్పులు లేకపోవడం నిరాశ కలిగించింది. నూతన పెన్షన్ విధానాన్ని తొలగించి.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింపజేస్తారని వేతన జీవులు ఎన్నో ఆశలతో ఎదురు చూశారు. కానీ.. బడ్జెట్‌లో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించడంతో నిరాశ మిగిలింది. మరోవైపు తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడం బాధాకరం.

**–బీ.మధుసూదన్‌రాజు, రిటైర్డ్ టీచర్, సత్తుపల్లి**

### భద్రాచలం రైల్వే లైన్‌ను విస్మరించారు..



కేంద్రం వివక్షతో కూడిన రాజకీయ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. ఈసారి బడ్జెట్‌లో భద్రాచలం, కొవ్వూరు రైల్వే లైన్‌ను విస్మరించింది. పోలవరం ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు స్పష్టమైన, నిర్దిష్టమైన హామీ ఇవ్వకపోవడం అన్యాయం చేసినట్లే. పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలం, పినపాక నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాలు ముంపునకు గురవుతున్నా.. వాటి విషయంలో కేంద్రం ఎటువంటి సూచనలు, సలహాలు ఇవ్వలేదు. భద్రాచలాన్ని ఆనుకొని ఉన్న ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కలిపే విషయంలో ఎటువంటి స్పష్టత లేదు. ఈ బడ్జెట్ పేదలను కొట్టి పెద్దలకు పెట్టేదిగా ఉంది.

**–మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు, భద్రాచలం**

### బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా..



ఆంధ్రాలో వెనుకబడిన ప్రాంతాలకు బడ్జెట్‌లో నిధులిచ్చినప్పుడు.. మరి తెలంగాణలో వెనుకబడిన పది జిల్లాలకు ఎందుకు నిధులు కేటాయించలేదు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్ష ఇక్కడి కనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఊసేలేదు. ఐటీఐఆర్, ఐసర్, నవోదయ విద్యాలయాలు ఇవ్వలేదు. తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా కల్పించలేదు. కనీసం పునర్విభజన చట్టంలోని హామీలను ప్రస్తావించలేదు. బడ్జెట్‌లో తెలంగాణ పేరు కూడా ప్రస్తావించలేదు. బడ్జెట్‌లో కేంద్రం ఇచ్చింది గుండు సున్నాయే.

**–యెర్రా కామేష్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం**




### కార్పొరేట్లకు అనుకూలంగానే..

బడ్జెట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగానే వ్యవహరిస్తోంది. విద్యార్థి లోకానికి తీవ్ర నిరాశను మిగిల్చింది. యువతకు ఉపాధి, నైపుణ్యానికి పెద్దపీట పేరుతో కార్పొరేట్ అవసరాలను తీర్చే మానవ వనరులను తయారు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. 500 టాప్ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌కు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.5 వేలు నెలవారీ స్టైఫండ్ ఇస్తామనడం విడ్డూరంగా ఉంది.

**–సంద్ర భూపేందర్, భద్రాచలం**

### బీజేపీ భాగస్వామ్య పక్షాల బడ్జెట్



బీజేపీ, దాని భాగస్వామ్య పక్షాల పాలిత రాష్ట్రాల బడ్జెట్‌గా ప్రజలకు అర్థమవుతుంది. కొన్నేళ్లుగా తెలంగాణ ప్రజల డిమాండ్‌గా ఉన్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్ నిర్మాణాల ఊసే లేదు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీని ప్రకటించలేదు. నిరుద్యోగానికి తోడు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేదలపై భారం పడుతున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదు.

**–పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి**

### వారికి లబ్ధి చేకూర్చే బడ్జెట్



పెట్టుబడిదారి వ్యవస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉంది ఈ బడ్జెట్. ఎన్డీఏ కూటమికి మద్దతు పలికిన ఏపీ, బీహార్ రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరేలా కనిపిస్తోంది. తెలంగాణకు కేటాయింపులు గుండు సున్నా. బీజేపీ ఎన్నికల హామీల్లో ముఖ్యంగా బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీల ప్రస్తావన లేకపోవడం బాధాకరం. ఈ బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు లేదు.. బీజేపీ బడ్జెట్‌లా ఉంది.

**–కొక్కెరపాటి పుల్లయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు**